క్లుప్తంగా

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



సర్వేలో పాల్గొన్న నాయకులు

కేశంపేట: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. శనివారం మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ ఇళ్ల సర్వేను నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. కార్యక్రమంలో నాయకులు అబ్బి సుందరయ్య, తాండ్ర కృష్ణారెడ్డి, చెవేళ్ల నర్సింలు, కసాబ్ ప్రభాకర్‌జీ, అవంచ బాల్‌రాజు, ఉత్తర పల్లి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: రాష్ట్ర సాంఘిక సంక్షేమ బంటారం బాలికల పాఠశాలలో వచ్చే సంవత్సరం 2025–26గాను ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సునీత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని, డిసెంబర్ 21 నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. చివరి గడువు ఫిబ్రవరి 1వ తేదీలోపు అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో వంద రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫిబ్రవరి 23వ తేదీన 11 నుంచి 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. పరీక్ష వికారాబాద్ జిల్లా బంటారం సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో ఉంటుందని సమయానికి విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా గణితశాస్త్ర వారోత్సవాల ముగింపు



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న సిబ్బంది

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో గణిత శాస్త్ర వారోత్సవాలను సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని వారంరోజుల పాటు పాఠశాలలో వారోత్సవాలను నిర్వహించారు. శనివారం ముగింపు సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, నాటక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అనంతరం గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

టీఎస్‌యూటీఎఫ్ నాయకుల డిమాండ్



హెచ్‌ఎం రాములును పరామర్శిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడ్తాల్: తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాములుపై స్వాముల ముసుగులో కొందరు భౌతికంగా దాడి చేయడం దారుణమని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు అన్నారు. అకారణంగా దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శనివారం హెచ్‌ఎంను నాయకులు పరామర్శించి మాట్లాడారు. ఈ నెల 21న పాఠశాల సమయం అనంతరం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న క్రమంలో అయ్యప్ప మాలధరించిన విద్యార్థికి హెచ్‌ఎం చేయి తగిలిందని తెలిపారు. దీంతో హెచ్‌ఎం కావాలనే విద్యార్థిని కాలుతో తన్నాడని ఆరోపిస్తూ.. కొందరు అయ్యప్ప మాలధారులు ఆయనపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. రెండు రోజుల అనంతరం పెద్ద సంఖ్యలో వచ్చి, హెచ్‌ఎంను దూషించడంతో పాటు మరోసారి దాడి చేసినట్లు పేర్కొన్నారు. అంతే కాకుండా విద్యార్థి కాళ్లు మొక్కించారని వెల్లడించారు. హెచ్‌ఎంపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని, నిందితులను వెంటనే శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, మండల అధ్యక్షుడు జంగయ్య తదితరులు ఉన్నారు.

ట్రా‘ఫికర్’

మొయినాబాద్‌లో నిత్యం ట్రాఫిక్ జామ్

- ఇష్టారాజ్యంగా షాపుల ఎదుట టీ పాయింట్లు, బండికొట్లు ఏర్పాటు
- పార్కింగ్ స్థలం లేక రోడ్లపైనే వాహనాలు
- పట్టించుకోని అధికారులు, పోలీసులు



మొయినాబాద్‌లో నడిరోడ్డుపై నిలిపిన ఆర్టీసీ బస్సులు

మొయినాబాద్: మొయినాబాద్‌లో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. నిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుండడంతో పాటు మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరుపక్కలా ఉన్న షాపుల ఎదుట పార్కింగ్ సరిగా లేదు. దీనికి తోడు షాపుల ఎదుట బండి కొట్లు ఏర్పాటు చేయడంతో వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు. దీంతో ప్రతి నిత్యం మొయినాబాద్ ప్రధాన చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీన్ని పరిష్కరించాల్సిన అధికార యంత్రాంగం, పోలీసులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది.

రహదారిపై పార్కింగ్..

హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై ఉన్న మొయినాబాద్ మండల కేంద్రంలో పార్కింగ్, ట్రాఫిక్ సమస్య జటిలమైంది. జాతీయ రహదారికి ఇరు పక్కల సుమారు అర కిలోమీటర్ దూరం వాణిజ్య సముదాయాలు(షాపులు) ఉన్నాయి. కానీ ఆ షాపుల ఎదుట మాత్రం పార్కింగ్ స్థలాలు లేవు. షాపుల ఎదుట ఉండే కొద్దిపాటి స్థలాన్ని సైతం యజమానులు చిన్న చిన్న బండి కొట్లు పెట్టడానికి అద్దెకు ఇస్తున్నారు. దీంతో షాపులకు, బండి కొట్ల వద్దకు వచ్చినవారు తమ వాహనాలను రోడ్లపైనే నిలిపి వెళ్తున్నారు. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనాలకు ఇబ్బంది ఏర్పడి ట్రాఫిక్ జామ్ అవుతోంది.

ఇష్టారాజ్యంగా షాపుల ఏర్పాటు..

గ్రామాలు, పట్టణాల్లో ఎలాంటి షాపులు ఏర్పాటు చేసినా వాటికి పంచాయతీ, మున్సిపల్ అధికారుల నుంచి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే మొయినాబాద్ గ్రామ పంచాయతీ కావడంతో ఇక్కడ పంచాయతీ అధికారులు షాపులకు ట్రేడ్ లైసెన్స్ జారీ చేస్తారు. ఏ రకమైన షాపు ఏర్పాటు చేస్తున్నారు. దాని ముందు ఖాళీ స్థలం ఎంత ఉంది. పార్కింగ్ స్థలం ఉందా అనే విషయాలను పంచాయతీ అధికారులు పరిగణలోకి తీసుకొని ట్రేడ్ లైసెన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ మొయినాబాద్‌లో ఇవన్నీ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఎలాంటి నిబంధనలు పాటించకుండానే ట్రేడ్ లైసెన్స్‌లు ఇస్తుండడంతో షాపుల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తమ షాపు ఎదుట నుంచి సుమారు 20–30 అడుగుల ముందు వరకు రోడ్డు స్థలాన్ని కబ్జాచేసి వాటిలో బండికొట్లు ఏర్పాటు చేయిస్తున్నారు. వారి వద్ద రోజువారీగా అద్దెలు వసూలు చేస్తూ లక్షలు దండుకుంటున్నారు. షాపుల ముందు అక్రమంగా రేకుల షెడ్లు ఏర్పాటు చేసినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు.

వీవీపీ రూట్‌గా ప్రకటించినా మారని పరిస్థితి..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో హైదరాబాద్–బీజాపూర్ రహదారిని వీవీపీ మూమెంట్ రూట్‌గా ప్రకటించారు. ముఖ్యమంత్రి కొడంగల్ వెళ్లాలంటే ఇదే రూట్‌లో వెళ్లాల్సి ఉంటుంది. అదే విధంగా శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తన నియోజకవర్గం వికారాబాద్‌కు వెళ్లాలనే ఇదే రూట్‌లో వెళ్లాలి. వారంలో రెండు, మూడు సార్లు ఆయన వికారాబాద్ వెళ్లి వస్తూ ఉంటారు. అందుకే పోలీసులు వీవీపీ మూమెంట్ రూట్‌గా ప్రకటించారు. కానీ అందుకు తగ్గట్లుగా చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమయ్యారు. మొయినాబాద్ ప్రధాన చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తి కిలోమీటర్ దూరం వరకు ట్రాఫిక్ నిలిచిపోతోంది. ట్రాఫిక్ పోలీసులు అక్కడ ఉన్నా ఫొటోలు తీయడానికే పరిమితమవుతున్నారే తప్పా ట్రాఫిక్ సమస్యను మాత్రం పరిష్కరించడం లేదు. దీంతో నిత్యం ఈ రహదారిపై వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం రోజు మొయినాబాద్‌లో సంత(అంగడి) ఉండటంతో ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది.

బస్టాండ్‌లో పార్కింగ్..

మొయినాబాద్‌లో బస్టాపుల్లోనే ఆటోలు నిలుపుతుండడంతో బస్సులు వచ్చి రోడ్డుపైనే ఆగుతున్నాయి. దీంతో వెనక నుంచి వచ్చిన వాహనాలు, బస్సుల వెనకాలే ఆగడంతో బస్సులు కదిలేంత వరకు ట్రాఫిక్ నిలిచిపోతోంది. బస్టాపుల వద్దనే బ్యాంకులు ఉండటంతో బ్యాంకులకు వచ్చినవారు రోడ్డుపైనే వాహనాలను నిలుపుతున్నారు. అదే విధంగా రోడ్డుకు ఇరుపక్కలా ఉన్న షాపుల ఎదుట టీ పాయింట్లు, జూస్ బండ్లు, పానిపూరీ బండ్లు ఏర్పాటు చేయడంతో షాపుల ఎదుట పార్కింగ్ స్థలం లేకుండాపోతోంది. పార్కింగ్ స్థలం లేకుండా అక్రమంగా ఏర్పాటు చేస్తున్న బండికొట్లను తొలగించడంలో పంచాయతీ అధికారులు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, పోలీసులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

“షాపుల ఎదుట కొట్లను తొలగించాలి

మొయినాబాద్‌లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాపుల యజమానులు డబ్బులకు కక్కుర్తి పడి షాపుల ఎదుట ఖాళీ స్థలాలను కూడా వదలడంలేదు. ఖాళీ స్థలాలను అద్దెకు ఇచ్చి డబ్బులు దండుకుంటున్నారు. షాపులకు వచ్చేవారు తమ వాహనాలను రోడ్లపైనే ఆపడంతో వెంటనే ట్రాఫిక్ పోలీసులు ఫొటోలు తీసి ఛలాన్లు వేస్తున్నారు. షాపుల ఎదుట ఏర్పాటు చేసిన చిన్నచిన్న కొట్లను తొలగిస్తే ట్రాఫిక్ సమస్య కొంతవరకు తీరుతుంది.

– మండడి వెంకట్‌రెడ్డి, మొయినాబాద్

చర్యలు తీసుకుంటాం

మొయినాబాద్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తున్నాం. రోడ్డుకు ఇరుపక్కలా షాపుల ముందు జూస్ బండ్లు, టీ కొట్లు, చాట్‌బండార్, తోపుడు బండ్లు పెడుతున్నారు. షాపుల ఎదుట పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్లపై వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అలాంటి వాటిపై చర్యలు తీసుకుని ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం. బస్టాపుల వద్ద పార్కింగ్ చేసే వాహనదారులపై చర్యలు తీసుకుంటాం.

– రాజేందర్‌గౌడ్, ట్రాఫిక్ సీఐ, రాజేంద్రనగర్

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



శిక్షణకు ఎంపికైన వారికి ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ సమావేశ మందిరంలో మైక్రోసాఫ్ట్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వారి సహకారంతో స్వింఫై వారి ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్‌లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ఉన్నత విద్యలు అభ్యసించిన యువకులకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో వారు నిరుద్యోగులుగా మారారన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డేటా సైన్స్‌పై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. నిరుద్యోగులు ఈ శిక్షణ తరగతులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శిక్షణకు ఎంపికైన వారికి ధ్రువపత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, కమిషనర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జనార్ధన్‌రెడ్డికి ఘన నివాళి

కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పి.జనార్ధన్‌రెడ్డి వర్ధంతిని శనివారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నేతలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జనార్ధన్‌రెడ్డి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. పేద ప్రజల అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, రఘునాయక్, బాల్‌రాజ్‌గౌడ్, కొంకళ్ల చెన్నయ్య, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, దంగు శ్రీనివాస్‌దవ్, బస్వం, అశోక్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ పల్లకీసేవ



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం స్వామివారి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు రాఘవేంద్రచార్యులు, ప్రమోద్, సునీల్ పంతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. స్వామివారి పల్లకీసేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి ప్రముఖ కాంట్రాక్టర్ యెన్నం గోపాల్‌రెడ్డి రూ.10వేల విరాళం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం దేవాలయానికి సంబంధించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వన్నాడ ప్రకాశ్‌గౌడ్, న్యాయవాది చెంది మహేందర్‌రెడ్డి, భక్తులు శ్రీశైలం, ఎంసాని నర్సింలు, అశోక్‌గౌడ్, రఘుగౌడ్, రఘునందన్, కిషన్‌నాయక్, రాఘవేందర్, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, వసంత రావు, లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి



నర్సింహాచారికి నియామకపత్రం అందజేస్తున్న శ్రీధర్‌రెడ్డి, రాము

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి

షాబాద్: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర స్వచ్ఛ భారత్ కన్వీనర్ రాము పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామంలో 234 బూత్ అధ్యక్షుడిగా నర్సింహాచారిని ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలతో అలవోకగా ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో మూటగట్టుకున్న పాపాలను కాంగ్రెస్ సర్కారు ఒక్క ఏడాదిలోనే మూటగట్టుకుందన్నారు. కాంగ్రెస్ ఏడాది గడిచినా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేని అసమర్థ ప్రభుత్వం అన్నారు. ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ నాయకులను అడుగడుగునా నిలదీస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ మోర్చా జిల్లా కార్యదర్శి మాణెయ్య, నాయకులు అనంతం, మహేందర్, ప్రశాంత్, సతీశ్‌గౌడ్, నవీన్‌కుమార్, రాజు, తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ఆలురి ఆంజనేయులుకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రూ.16 వేల చెక్కు మంజూరైంది. ఈ మేరకు శనివారం ఇప్పలపల్లిలో బాధితుడికి కాంగ్రెస్ పార్టీ నాయకులు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్‌రెడ్డి, డేవిడ్, రేణురెడ్డి, శంకర్, శివగౌడ్, చంద్రమౌళి, కిషన్, వాల్మీకి, శ్రీను, అంజయ్య ఉన్నారు.

వెల్జాల్‌లో..

మండల పరిధి వెల్జాల్ గ్రామానికి చెందిన తిరుపతయ్య చికిత్సపొందుతూ మృతిచెందగా సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.60 వేలు మంజూరైంది. ఈ మేరకు మృతుడి కుటుంబ సభ్యులకు నాయకులు చెక్కు అందజేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అంబాజీ ఉన్నారు.

ధ్యాన జగత్తుకు కృషిచేయాలి

కడ్తాల్: ధ్యాన గురువు బ్రహ్మర్షి పత్రీజీ వేసిన ధ్యానమనే పునాదులపై సకలజనులు నడుచుకోవాలని పరిణీత పత్రి సూచించారు. మహేశ్వర మహాపిరమిడ్ పత్రీజీ ధ్యాన మహాయాగం శనివారానికి 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచి పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ ప్రాపంచిక ఎదుగుదలతో పాటు, ఆధ్యాత్మిక ఎదుగుదల ఉండాలని చెప్పారు. ధ్యాన జగత్తుకు కృషి చేయాలని కోరారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి.. మహాయాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సర్కారు బడికి ఫ్యాన్లు అందజేత



ఫ్యాన్లు బహూకరిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పది సీలింగ్ ఫ్యాన్లు బహూకరించారు. పాఠశాల ఆవరణలో శనివారం లయన్ సభ్యులు కండె ఓంకారం, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్యలు అందజేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీం, డీసీసీ కార్యదర్శి రవీందర్‌యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కృష్ణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రమేశ్, నాయకులు శేఖర్, శ్రీను, సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలి



సమ్మె నిర్వహిస్తున్న కార్మికులు

జీపీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్

కేశంపేట: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి, కారోబార్, బిల్ కలెక్టర్, అర్హులైన వారిని జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని జీపీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్ అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మికులు తమ డిమాండ్ల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న టోకెన్ సమ్మె శనివారం రెండోరోజు కొనసాగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాంచందర్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్మికులందరికీ ఎలాంటి షరతులు లేకుండా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్ 5 లక్షలు చెల్లించాలన్నారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ప్రస్తుతం జీపీలో పనిచేస్తున్న ప్రతీ కార్మికుడిని ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని కోరారు. కార్యక్రమంలో రవి, పద్మ, పరేషా, బుచ్చమయ్య, జంగయ్య, మల్లేశ్, రాములు పాల్గొన్నారు.

వైభవం.. వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితుడు వేణుగోపాలాచార్యులు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని దైవాలగూడ వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. దైవాలగూడ గ్రామంలో గల వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా టీటీడీ ఆధ్వర్యంలో యజ్ఞహోమాల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్దెంగూడ మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. నాగర్‌కుంట గ్రామానికి చెందిన మల్లీ మహేశ్ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తూర్పింటి రఘురాం, సత్యనారాయణ, పార్వతి, భాస్కర్, విజయ్, నారాయణ, శ్రీనివాస్, జయరాం, శివకుమార్, యాదయ్య, బాలయ్య, విఠల్, రాజు, రాజేందర్‌గౌడ్, సాయి, రమేశ్, సాయి, లక్ష్మణ్, రఘు తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోండి

మంచాల: ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం శోభ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని విభిన్న ప్రతిభవంతుల కేంద్రంలో లయన్స్ క్లబ్, సాధురం కంటి వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 100 మందికి కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. 25 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ లాలయ్య, ఏఎస్‌ఐ సతీష్, డాక్టర్లు ఎమ్మెస్ రెడ్డి, భగవాన్, యాదగిరి, ఎస్.కె. భిక్షపతి, కో–ఆప్షన్ మాజీ సభ్యుడు ఆశ్వల బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.




కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

ఎమ్మెల్యే కసిరెడ్డికి కాంగ్రెస్ నాయకుల వినతి

ఆమనగల్లు: పట్టణంలోని రాజీవ్ కూడలిలో దివంగత నేత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు. శనివారం నగరంలోని ఆయన నివాసంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. పరిశీలన అనంతరం నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న నాయకులు

విద్యార్థికి అభినందన

పంజాబ్‌లో నిర్వహించిన 68వ జాతీయ స్కూల్ గేమ్స్‌లో కరాటే విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి, రజతపతకం సాధించిన వెల్దండ మండలం నగారాతండాకు చెందిన విద్యార్థి అర్జున్ మురళిని ఎమ్మెల్యే అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.